శబరిమలకు మరో 34 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం మరో 34 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు ఆదివారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. జనవరి 7 నుంచి 27 వరకు ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్-కొట్టాయం, మౌలాలి-కొట్టాయం, కొట్టాయం-సికింద్రాబాద్, కొట్టాయం-కాచిగూడ, మౌలాలి-కొల్లం స్టేషన్ల మధ్య ఈ రైళ్లు నడుస్తాయని అధికారులు తెలిపారు.

నిఫ్ట్‌లో సిరిసిల్ల విద్యార్థినుల స్టడీ టూర్

హైదరాబాద్, డిసెంబర్8 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) క్యాంపస్‌ను సిరిసిల్లలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆదివారం సందర్శించారు. స్టడీ టూర్‌లో భాగంగా కళాశాలకు చెందిన డిజైన్, టెక్నాలజీ కోర్సు విద్యార్థినులు ఈ టూర్‌లో పాల్గొన్నారు. నిఫ్ట్‌లోని వివిధ విభాగాలను వారు పరిశీలించారు. ఫ్యాషన్, టెక్నాలజీ రంగాల నూతన పోకడలను అక్కడి నిపుణుల ద్వారా తెలుసుకున్నారు. నిఫ్ట్ కాన్వొకేషన్-2024కి హాజరైన కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్, డైరెక్టర్ ప్రొఫెసర్ మాలినీ దివాకళ తదితరులను ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేకంగా కలిశారు.

14,15 తేదీల్లో మరో అల్పపీడనం

16,17 తేదీల్లో రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈ ఏడాది భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. వానకాలంలో ఎండలు దంచికొట్టగా.. చలికాలంలో వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే ఇందుకు కారణమని వాతావరణ కేంద్రం అధికారులు చెప్తున్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో వర్షం కురిసింది. ఈ నెల 14,15 తేదీల్లో అండమాన్ సమీపంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో 16,17తేదీల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశమున్నట్టు పేర్కొన్నారు.

బిల్లుల కోసం అసెంబ్లీలో గళమెత్తాలి

కేసీఆర్‌కు సర్పంచుల జేఏసీ వినతి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తేతెలంగాణ): పెండింగ్ బిల్లులు చెల్లించేలా అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తాలని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎర్రవెల్లిలోని నివాసంలో జేఏసీ నాయకులు కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. అసెంబ్లీలో ఈ సమస్యను ప్రస్తావించాలని కోరారు. సమావేశంలో గణేశ్, ప్రభాకర్, పద్మాకర్‌రెడ్డి, బీరప్ప, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో నిలదీస్తాం

▸ II తరువాయి...

అధ్యక్షతన బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యవసాయ రంగంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అన్ని హామీలను, గ్యారెంటీలను అమలుచేయడంలో విఫలమైన తీరును అసెంబ్లీ సాక్షిగా ఎండగడతామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, గిరిజనులకు ఇచ్చిన డిక్లరేషన్లపై కూడా ప్రభుత్వం తీరును ప్రశ్నిస్తామని స్పష్టంచేశారు.

గురుకులాల్లో అధ్వాన్న పరిస్థితులు

రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. 'గతంలో గురుకులాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అద్భుతంగా తయారుచేసి నిర్వహించింది. గురుకుల వ్యవస్థను రేవంత్ సర్కారు సంక్షోభంలోకి నెట్టింది. గురుకుల బాట కార్యక్రమం ద్వారా బీఆర్‌ఎస్వీ గురుకులాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీ కేసీఆర్‌కు నివేదిక ఇచ్చింది. గురుకులాలపై మాజీ మంత్రులు సబిత, జగదీశ్‌రెడ్డి కూడా సలహాలు సూచనలు అందించారు. గురుకులాలను సంస్కారవంతంగా నడిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేసీఆర్ సూచించారు. గురుకులాల్లో పరిస్థితులను కండ్లకు కట్టినట్టు ప్రభుత్వం దృష్టికి తేవాలని ఆదేశించారు. గురుకులాల భవిష్యత్‌పై ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

సర్కారు దౌర్జన్యకాండ

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి దౌర్జన్యకాండ సాగిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాల భూములను సేకరించి పరిశ్రమల స్థాపనకు అన్ని సిద్ధంగా ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం 20 చోట్ల ఫార్మా విలేజ్‌ల పేరుతో పేద రైతుల భూములను గుంజుకుంటున్నదని దుయ్యబట్టారు. 'కొడంగల్, సంగారెడ్డి, లగచర్ల వంటి ప్రాంతాల్లో దళిత, గిరిజన రైతులపై ప్రభుత్వం రాత్రివేళల్లో పోలీసులతో దాడులు చేయిస్తున్నది. కేసులు పెట్టి, నిర్బంధించి రైతుల భూములు లాక్కుంటున్నది. ఈ విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ఫార్మాసిటీ కోసం ఇప్పటికే 14 వేల ఎకరాలు సేకరించి పెట్టాం. ఫార్మాసిటీ ఉంటుందని హైకోర్టుకు చెప్పారు. మళ్లీ 20 ఫార్మా విలేజ్‌లకు ఎందుకు తెరలేపారు? దళిత, గిరిజన, చిన్న, సన్నకారు రైతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది. పట్నం నరేందర్‌రెడ్డి సహా 40 మంది రైతులు జైళ్లలో ఉన్నరు. వారందరినీ తక్షణమే విడుదల చేసి, రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అరాచకాలపై అసెంబ్లీలో నిలదీస్తాం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రజల కష్టకష్టాల్లో పాలు పంచుకునేందుకు ప్రయత్నం చేస్తే వారిని అడ్డుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను నిర్బంధిస్తున్నారని, ఎక్కడికక్కడ వారి హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. 'గురుకుల విద్యార్థులను కలవకుండా ఎమ్మెల్యే కోవా లక్ష్మిని గృహ నిర్బంధం చేశారు. రెండో విడత దళితబంధు నిధులు అడిగినందుకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతున్నది. సర్కారు అరాచకాలపై అసెంబ్లీలో నిలదీస్తం. తెలంగాణ ఉద్యమం, చరిత్రపై ప్రభుత్వానికి అవగాహన లేదు. తెలంగాణతల్లి రూపురేఖలను మార్చి అస్తిత్వంపై దాడి చేస్తున్నారు. ప్రజల ఆవేదనకు బీఆర్‌ఎస్ గొంతుకగా నిలుస్తుంది. ప్రభుత్వం చేసిన దుర్మార్గమైన పనిని అసెంబ్లీ, మండలిలో నిలదీస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్రామాల్లో సంక్షోభ పరిస్థితులు

ఏడాదికాలంగా గ్రామ పంచాయతీల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'దోమల పిచికారీ మందులకు కూడా పైసల్లేవు. తాజా మాజీ సర్పంచులకు బిల్లులు ఇచ్చే పరిస్థితి లేదు. సెక్రటరీలకు డబ్బులు ఇచ్చే వాళ్లు లేరు. పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా పల్లెలను బాగుచేశాం. తెలంగాణ గ్రామాలను దేశానికే ఆదర్శంగా నిలిపాం. ప్రస్తుతం పల్లెల దీనస్థితిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇస్తామని రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికారు. ఇప్పటివరకు దళితబంధుకు రూపాయి కూడా విడుదల చేయలేదు. రెండో విడత దళితబంధు డబ్బులు కూడా ఇవ్వలేదు. దళితబంధు నిధులపై అసెంబ్లీలో సర్కారును ప్రశ్నిస్తాం. కాంగ్రెస్ 420 హామీలను అసెంబ్లీలో ఎండగడతాం. బీసీ డిక్లరేషన్‌పై అసెంబ్లీలో సర్కారును నిలదీస్తాం. ప్రజాసమస్యలపై ప్రతిరోజు అసెంబ్లీలో ప్రశ్నలు సంధిస్తాం. రాష్ట్ర శాసనమండలి, శాసనసభలో అనుసరించాల్సిన వ్యూహాలపై మాకు దిశా నిర్దేశం చేసిన మా పార్టీ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రాజీనామా చేద్దాం..దా!

▸ II తరువాయి...

బూతులు వినడానికి అసెంబ్లీకి కేసీఆర్ రావాల్నా? రేవంత్ నీచమైన భాష మాట్లాడుతున్నంత వరకు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి అవమానపడాల్సిన అవసరం లేదని చెప్పారు. కేసీఆర్ ఎవరికీ భయపడేవారు కాదని, అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సంధించే ప్రశ్నలకే సమాధానాలు వెతుక్కుంటున్నారని, ఇక కేసీఆర్‌కు ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. కేసీఆర్ బయటకు రాకున్నా ఆయన మార్గదర్శనం ప్రకారమే పనిచేస్తున్నామని చెప్పారు. కేసీఆర్ మౌనంగా ఉండటం వెనుక వ్యూహం ఉన్నదని, అన్నీ గమనిస్తూనే ఉన్నారని చెప్పారు. 60 లక్షల మంది కార్యకర్తలున్న పార్టీ తమదని, కేసీఆర్ ఏది నిర్ణయిస్తే అదే జరుగుతుందని చెప్పారు. 'ప్రాణత్యాగానికి సిద్ధపడి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను తిడితే చూస్తూ ఊరుకోబోము. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్టుగా రేవంత్‌రెడ్డికి ఆయన భాషలోనే బుద్ధి చెప్తున్నాం. రేవంత్‌రెడ్డి మాటలు వినలేక ప్రజలు టీవీలు బందుపెడుతున్నరు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

మూటల వేట కోసమే మూసీ ప్రక్షాళన

మూసీ సుందరీకరణకు టెండర్లు పిలవకుండా, డీపీఆర్ లేకుండా ఇండ్లు కూల్చడం ఏమిటి? ఇది డబ్బు మూటల వేట కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. హామీల అమలుకు డబ్బులు లేనప్పుడు మూసీకి లక్షన్నర కోట్లు ఎక్కడినుంచి వస్తున్నాయి. హామీల అమలుపై వాట్సాప్‌లో స్టేటస్‌లు, సోషల్‌మీడియాలో ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోస్టులు పెడితే.. కాంగ్రెస్ వాళ్లు, పోలీసులు బెదిరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు పోలీసులు, అధికారులు అనుకూలంగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ' బావమరిదికి అమృతం, అల్లుడికి లగచర్ల, అనుముల బ్రదర్స్‌కు ఫోర్త్‌సిటీ అప్పగించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి అదానీని లిఫ్ట్ దగ్గర కలవలేదు.. ఢిల్లీలో లిఫ్ట్ కోసం కలిశారు. పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్ జరిగి మూడు నెలలు గడిచినా ఎందుకు తేలలేదు. రేవంత్‌కు రక్షణ కవచంగా పనిచేస్తున్న బండి సంజయ్.. పెనవేసుకున్న అనుబంధంతో పనిచేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసిమెలిసి పనిచేస్తున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి నేర్చుకున్న పోరాట పటిమ ఉన్నది కాబట్టి ఈటల రాజేందర్ ప్రజల పక్షాన పోరాడుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు కలిసి భూములు కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తొందరలోనే అన్నీ బయటపెడతాం' అని తేల్చి చెప్పారు.

ప్రజల కోసం జైలుకైనా సిద్ధమే

తనపై ఏదో ఒక కేసు పెట్టి జైలుకు పంపి మూడు నాలుగు నెలలు ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తనపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా తగ్గేది లేదని, ప్రజల కోసం వంద సార్లయినా జైలుకు వెళ్లాడానికి సిద్ధమని పునరుద్ఘాటించారు. 'ఆత్మవిశ్వాసంతో బతకడాన్ని అహంకారం అంటే ఏమీ చేయలేం. ఎవరేమి అనుకున్నా తగ్గను. తప్పు చేయనప్పుడు ఎందుకు తగ్గాలి? అబద్ధాలకు అంగీ లాగు తొడిగితే ఎనుముల రేవంత్‌రెడ్డి. తెలంగాణ అస్థిత్వాన్ని మార్చాలని చూస్తే సహించం. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తాం. గత పదేండ్లలో మేం కక్ష సాధింపులకు పాల్పడితే కాంగ్రెస్ లీడర్లు ఒక్కరు కూడా బయట తిరిగేవాళ్లు కాదు. కక్ష సాధింపు చర్యలు మానుకుని పాలనపై దృష్టి పెట్టాలి' అని కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

ఎఫ్‌డీఎల్ - ఏపీ సంస్థతో సోనియాకు లింకులు

బీజేపీ ఆరోపణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి అమెరికాకు చెందిన జార్జ్ సొరోస్ ఫౌండేషన్ నిధుల సాయంతో నడిచే ఎఫ్‌డీఎల్-ఏపీ సంస్థతో సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆదివారం ఆరోపించింది. కశ్మీర్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలనే ఆలోచనకు సొరోస్ ఫౌండేషన్ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ తెలిపింది. భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ సంస్థల ప్రభావాన్ని ఈ సంస్థ తెలియజేస్తున్నదని తన వరుస ఎక్స్ పోస్ట్‌లో బీజేపీ వెల్లడించింది. తమ పార్టీ ఆరోపణలను అమెరికా ప్రభుత్వం ఖండించడంపై రాహుల్ గాంధీకి లోక్‌సభలో పది ప్రశ్నలు సంధిస్తానని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తెలిపారు. సోనియా గాంధీ సహధ్యక్షురాలిగా ఉన్న ఫోరమ్ ఫర్ ది డెమొక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా పసిఫిక్(ఎఫ్‌డీఎల్-ఏపీ)కి జార్జ్ సొరోస్ ఫౌండేషన్ నిధులు ఇచ్చే సంస్థతో సంబంధాలున్నాయని బీజేపీ ఆరోపించింది. మరోవైపు సోనియా గాంధీ చైర్మన్‌గా ఉన్న రాజీవ్ గాంధీ ఫౌండేషన్‌కు సొరోస్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం ఉందని.. బీజేపీ విమర్శించింది.

సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

టీజీఆర్‌ఎస్‌ఏ నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్‌ఎస్‌ఏ)కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ వీఆర్‌ఏ, వీఆర్వోలు లేకపోవడం వల్ల లగచర్ల వంటి ఘటనలు జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. టీజీఆర్‌ఎస్‌ఏ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బాణాల రాంరెడ్డిని అభినందించారు. రెవెన్యూ శాఖలోని అన్ని స్థాయిల ఉద్యోగులకు ఈ సంఘం ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా బిక్షం, కోశాధికారిగా మల్లేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుజాత హన్ ఎన్నికయ్యారు.

నానమ్మ కర్మకాండకు వెళ్లి మనుమడు మృతి

- *స్నానాలు చేస్తుండగా మోటర్‌కు విద్యుత్తు సరఫరా*
- *జగిత్యాల జిల్లా కిషన్‌రావుపేటలో విషాదం*

మొగిలి (ఫైల్)

వెల్గటూర్, డిసెంబర్ 8: నానమ్మ కర్మకాండలకు వెళ్లి సమీపంలోని బోరు వద్ద స్నానం చేస్తుండగా, విద్యుత్తు షాక్ తగిలి మనుమడు మృతి చెందాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌రావుపేటలో రెండ్రోజుల కిందట పిట్టల భీమక్క (80) అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మూడో రోజు కావడంతో గ్రామ శివారులోని శ్మశాన వాటికకు వెళ్లి కర్మకాండలు నిర్వహించారు. అక్కడ స్నానం చేసేందుకు నీటి సౌకర్యం లేకపోవడంతో పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్దకు కుటుంబ సభ్యులు, బంధువులు వెళ్లారు. ఈ క్రమంలో మోటర్‌కు విద్యుత్తు సరఫరా కావడంతో పిట్టల మొగిలి (35) సోదరుడు మల్లేశ్, కొడుకు రిషికి షాక్ కొట్టింది. వారిని తప్పించేందుకు మొగిలి వెళ్లగా షాక్‌కు గురై కుప్పకూలి పోయాడు. అక్కడ ఉన్నవారు మొగిలికి సీపీఆర్ చేసి అంబులెన్సులో కరీంనగర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రిషికి తీవ్ర గాయాలవడంతో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

నవ వధువు ప్రాణం తీసిన వాటర్ హీటర్

ప్రేమ పెండ్లి చేసుకున్న నాలుగు రోజులకే ఘటన

స్వప్న (ఫైల్)

నెన్నెల, డిసెంబర్ 8 : ప్రేమ పెండ్లికి తల్లిదండ్రులు ఒప్పుకోక పోగా.. పెద్దల సమక్షంలో తనకు ఇష్టమైన వాడిని మనువాడిని ఆ నవ వధువు అర్థాంతరంగా తనువు చాలించిం ది. కాళ్లపారాని ఆరకముందే కరెంట్ షాక్ రూపంలో ఆమెను మృత్యువు కబళించింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెలలో ఆదివారం తీవ్ర విషాదాన్ని నింపింది. మారమ్మవాడకు చెందిన స్వప్న (22), అదే గ్రామానికి చెందిన పల్ల సిద్ధు (టింకు) రెండేండ్లుగా ప్రేమించుకున్నారు. పెండ్లి చేసుకుందామని తల్లిదండ్రులను ఆశ్రయించగా వారు నిరాకరించారు. ఏం చేయాలో తోచక ఇరువురు గ్రామ పెద్దలను కలిశారు. వారి సమక్షంలో ఈ నెల 4న బెల్లంపల్లిలోని శివాలయంలో పెండ్లి చేసుకున్నారు. ఆదివారం ఉదయం స్వప్న స్నానం చేసేందుకు వాటర్ హీటర్‌ను బకెట్లో ఉంచింది. అదే సమయంలో కరెంట్ కోత విధించారు. కరెంట్ లేదనే నమ్మకంతో నీటిలో నుంచి హీటర్‌ను తీస్తుండగా, ఒక్కసారిగా కరెంట్ సరఫరా అయ్యింది. షాక్‌తో కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ విషాద ఘటన చూసిన స్థానికులు కన్నీరు పెట్టారు. స్వప్న తల్లిదండ్రుల వేదన అక్కడున్న వారిని కలిచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

కేసీఆర్ నిర్మాణం.. కాంగ్రెస్ ప్రారంభం

- **రేవంత్ కొత్తగా ఒక్క ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయలేదు**
- **బీఆర్‌ఎస్ హయాంలోనే బ్రాహ్మణ వెల్లంల ట్రయల్ రన్**
- **ఇద్దరు మంత్రులున్నా ఏడాదికాలంలో పైసా తేలేదు**
- **మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి**

నల్లగొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు

నల్లగొండ, డిసెంబర్ 8 : బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ సారథ్యంలో చేపట్టిన పనులకే ప్రారంభోత్సవాలు చేసి, తామే చేసినట్టు కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెబుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. దామరచర్లలో ప్రారంభం చేసిన యాదాద్రి పవర్‌ప్లాంట్, నల్లగొండలో ప్రారంభించిన వైద్య కళాశాల బీఆర్‌ఎస్ సర్కార్ నిధులతో చేపట్టినవేనని స్పష్టంచేశారు. నల్లగొండలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాది కాలంలో రేవంత్‌రెడ్డి ఈ జిల్లాకు ఇచ్చిన నిధులేమిటో చెప్పాలని ప్రశ్నించారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు 7500 మెగావాట్ల విద్యుత్తు తెలంగాణలో ఉంటే 2027 నాటికి 24 వేల మెగావాట్లు కావాలనే ఆలోచనతో దామరచర్లలో 4 వేల మెగావాట్ల అల్ట్రా మెగా పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తే అందులో 800 మెగావాట్లు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. ఇది కేసీఆర్ ముందుచూపే కారణమని, ఇందులో కాంగ్రెస్ చేసిందేమీ లేదని చెప్పారు.

చేసిన ప్రాజెక్టుకే మరోసారి ట్రయల్ రన్

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ట్రయల్ రన్ గత మే నెలలోనే చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యే హోదాలో చేస్తే దాన్ని మళ్లీ సీఎం రేవంత్‌తో ట్రయల్ రన్ చేయించడం హాస్యాస్పదంగా ఉన్నదని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. తాము శంకుస్థాపన చేసిన పనులు తమ హయాంలోనే 90 శాతం పూర్తి కాగా, వాటిని ఇప్పుడు ప్రారంభించి తమ ప్రాజెక్టులు అని గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. మూసీ ప్రక్షాళనను ప్రారంభించిందే తామని తెలిపారు.

ఇద్దరు మంత్రుల మోసాలు బయటపెడతా

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క శంకుస్థాపన కూడా చేయకుండా సొంత లాభం కోసం ఇద్దరు మంత్రులు పని చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. నిత్యం మోసాలతో పాలన చేస్తున్న ఇద్దరు మంత్రులు ఎవరి దగ్గర ఏం తీసుకున్నారో? వారిని ఎలా మోసం చేస్తున్నారో? చిట్టా మొత్తం తన దగ్గర ఉన్నదని, త్వరలోనే వారి మోసాలు బయట పెడుతామని మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌ను దృష్టిలో పెట్టుకొని విమర్శలు చేశారు. 'జిల్లాలో త్వరలో మీ బాధిత సంఘాలు ఏర్పాటు అవుతాయి. ఇక మీ మోసాలు బయటపడే సమయం వచ్చింది' అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్ తదితరులు పాల్గొన్నారు.

'గోర్‌బోలి'ని రాజ్యాంగంలో చేర్చాలి

- **గిరిజనులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**
- **ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్**

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): లంబాడీల భాష 'గోర్‌బోలి'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు లంబాడీలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని, గిరిజన గ్రామపంచాయతీలకు రూ.కోటి కేటాయించాలని కోరారు. గిరిజనుల అభివృద్ధి కోసం అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చర్చ జరగాలని ఆశాభావం వ్యక్తంచేశారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. లగచర్ల ఘటనలో జైలులో మగ్గుతున్న 51 మంది గిరిజన రైతులను విడుదల చేయాలని కోరారు.

ఫోర్త్‌సిటీకి భూములియ్యం!

- **రాచులూరులో రైతుల సమావేశం**
- **వంటావార్పు, సహపంక్తి భోజనాలు**
- **సంఘీభావం ప్రకటించిన ఎంపీ ఈటల**



కందుకూరు మండలం రాచులూరులో సమావేశమైన రైతులు

కందుకూరు, డిసెంబర్ 8: రాష్ట్ర ప్రభుత్వం బేగరికంచె సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీకి భూములివ్వబోమని రైతులు స్పష్టం చేశారు. కందుకూరు మండల పరిధిలోని రైతులు పలువురు ఆదివారం రాచులూరులో సమావేశమయ్యారు. ఫోర్త్‌సిటీ కోసం కొంగర నుంచి మండల పరిధిలోని అగర్‌మియగూడ, తిమ్మాపూరు, లేమూరు, రాచులూరు, గాజుల బుర్జు తండా, తుర్కగూడ, గుమ్మడవెల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట్, గ్రామాల మీదుగా 330 ఫీట్ల రోడ్డు కారణంగా రైతులు భూములు కోల్పోవాల్సి వస్తున్నది. కాగా, ఈ భూములను ఇవ్వకూడదని రైతులు నిర్ణయించారు. భూమికి భూమి, మార్కెట్ రేటు కంటే అదనంగా 3 రెట్లు పరిహారం ఇవ్వాలని రైతు లు డిమాండ్ చేస్తున్నారు. కాగా రైతులతో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం ప్రకటించారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. సమావేశం అనంతరం రైతులు అక్కడే వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామాల రైతులు ద్యాసాని సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, భూపాల్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌చారి, జంగయ్య, యాదయ్య, రమేశ్ పాల్గొన్నారు.

'క్రిస్మస్ గిఫ్ట్స్' లింకులతో భద్రం!

ప్రజలకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): క్రిస్మస్ వేడుకలపై సైబర్ నేరగాళ్లు ప్రత్యేక దృష్టి పెట్టి కోట్లాది రూపాయలు కొల్లగొట్టేందుకు పథకం రచించారని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిస్తున్నది. 'మీరు మా ప్రియమైన కస్టమర్. మీకు క్రిస్మస్ శుభాకాంక్షలు. ఈ క్రిస్మస్ గిఫ్ట్ మీకోసమే. కింద ఇస్తున్న లింక్‌పై క్లిక్ చేసి, గిఫ్ట్ పొందండి' అంటూ వచ్చే లింకులతో అప్రమత్తంగా ఉండాలని చెప్తున్నది. దీంతోపాటు 'మీ ప్రియమైన వారికి ఈ లింక్ ద్వారా మీ ఫొటో, పేరుతో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపండి' అంటూ సోషల్ మీడియాల్లో, వాట్సాప్‌లలో వచ్చే ప్రకటనలను నమ్మొద్దని సైబర్ పోలీసులు సూచిస్తున్నారు. క్రిస్మస్ సీజన్‌లో ఈ కొత్త తరహా సైబర్ మోసాలు చేసేందుకు కుట్రలు పన్నారని పేర్కొన్నారు. క్రిస్మస్ గ్రీటింగ్స్ పేరిట వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లింకులు పంపి.. వాటి ద్వారా ప్రమాదకరమైన మాల్‌వేర్‌ను ఓపెన్ చేసిన వారి ఫోన్లలోకి చొప్పించి, డేటా చౌర్యంతోపాటు, నగదును కూడా కొల్లగొట్టే కుయుక్తులు పన్నారని చెప్పా రు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930కి కాల్ చేయాలని సూచిస్తున్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ మైన్స్, ఇసుక లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి దామోదర్‌గౌడ్, పందుల యాదగిరిగౌడ్

ఇసుక లారీలపై దాడులు ఆపాలి

మైన్స్ అండ్ శాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

రవీంద్రభారతి, డిసెంబర్ 8: రాష్ట్రంలో ఇసుక లారీలతోపాటు వాటి యజమానులపై అధికారుల దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయని తెలంగాణ మైన్స్ అండ్ శాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. వాటిని వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ దామోదర్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ పందుల యాదగిరిగౌడ్ ఆదివారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అధిక లోడ్ పేరుతో ఆర్టీఏ, మైనింగ్, విజిలెన్స్ అధికారులు ఇసుక లారీలకు అడ్డగోలుగా రూ.లక్షల్లో చలానాలు విధిస్తున్నారని, ఆ జరిమానా కట్టలేక ఎంతో మంది లారీ యజమానులు, డ్రైవర్లు రోడ్డున పడుతున్నారని వాపోయారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి తదితర జిల్లాల్లో అధికారుల వేధింపులకు తాళలేక పలువురు లారీ యాజమానులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఇసుక లారీలపై దాడులు నిలిపివేయించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో తెలంగాణ మైన్స్ అండ్ శాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ వెన్నపూజ ఫణిశంకర్‌రాజ్, సుర్వీ లింగస్వామిగౌడ్, నరహరి సత్తయ్య, టీ పవన్‌కళ్యాణ్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.